నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL

మృత్యు..

- మాదకద్రవ్యాల మత్తులో యువత పెడదారి
- అమ్మాయిలపై సామూహికంగా లైంగిక వేధింపులు
- నెలలోనే గద్వాల జిల్లాలో రెండు ఘటనలు
- వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి బాలిక ఆత్మహత్య
- తల్లిదండ్రులకు మనోవేదన మిగుల్చుతున్న యువకులు
- న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు, పలు సంఘాల డిమాండ్



గద్వాల, సెప్టెంబర్ 22 : నడిగడ్డలో రోజురోజుకూ యువత పెడదారిపడుతున్నది. మాదక ద్రవ్యాల మత్తుకు అలవాటుపడడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. తెలిసీతెలియని వయస్సులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. కానీ వారు చేస్తున్న పనులకు తల్లిదండ్రులు తలదించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. తమ పిల్లలు కళాశాలకు వెళ్లి బాగా చదువుకొని ప్రయోజకులు అవుతారని తల్లిదండ్రులు కలలు కంటుండగా.. వారు బయట చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోతున్నది. దీంతో తల్లిదండ్రులకు మనోవేదన తప్పడం లేదు. సోషల్ మీడియాలో రీల్స్‌ను చూసి నడిగడ్డ యువత పెడదారి పడుతున్నట్లు సమాచారం.

గతంలో న్యూడ్ కాల్స్‌తో గద్వాల పరువును బజారు కీడ్చారు. కొంతమంది నాయకులు ఆ కేసును బయటకు రాకుండా తొక్కి పెట్టారు. ప్రస్తుతం యువత మత్తుకు అలవాటు పడి విద్యార్థినులు, యువతులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ కారణంగా తమ బిడ్డలను పాఠశాల, కళాశాలకు పంపాలంటేనే అమ్మాయిల తల్లిదండ్రులు భయపడుతున్నారు. జిల్లాలో ఈ ఒక్క నెలలోనే అమ్మాయిలపై లైంగిక వేధింపుల కేసులు రెండు నమోదు అయ్యాయంటే యువత ఎంత పెడదారి పట్టిందో అర్థమవుతున్నది. నడిగడ్డలో జరుగుతున్న లైంగిక వేధింపులకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే బాలికలు, యువతులు, మహిళలు బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడనున్నది. ముఖ్యంగా నడిగడ్డలో గంజాయి మూలాలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. 19 నుంచి 22 ఏండ్లలోపు యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇలాంటి లైంగిక దాడులకు పాల్పడుతూ ఆ మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి నెలకొన్నది.

బాధితులకు న్యాయం చేయాలి..

అటు గద్వాల మండలంలో, ఇటు కేటీదొడ్డి మండలంలో విద్యార్థినులు, యువతిపై లైంగిక దాడికి గురైన బాధితులకు న్యాయం చేయాలని మహిళా సంఘాలు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేటీదొడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని లైంగికంగా వేధించడమే కాకుండా ఆమె మృతికి కారణమైన వారిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై హత్యా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 19 ఏండ్లలోపు యువకులు పెడదారిపట్టి మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుందని వీటన్నింటిపై పోలీసులు దృష్టి సారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గద్వాల నియోజకవర్గంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు ఈ నెలలోనే రెండు చోట్ల చోటు చేసుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు చదువుతుండగా.. వారిని మీ పాఠశాల దగ్గర దింపుతామని యువకులు తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. వీరికి మరో ముగ్గురు యువకులు తోడై అసభ్యంగా ప్రవర్తించడం తోపాటు ఓ గదిలో బంధించి లైంగికంగా వేధించినట్లు తెలిసింది. సదరు విద్యార్థినులు ఇంటికి ఆలస్యంగా వెళ్లడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా.. జరిగిన విషయం చెప్పారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారంతా 19 నుంచి 22 ఏండ్లలోపు వారే కావడం గమనార్హం. ఈ ఘటన మరువకముందే కేటీదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన యువతి పొలం పనులకు వెళ్లే సమయంలో ముగ్గురు యువకులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఆ యువతికి ఏం చేయాలో తోచక పురుగుల మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు దవాఖానకు తరలించగా.. కోలుకుంటున్న సమయంలో అస్వస్థతకు గురైంది. దీంతో సదరు యువతి తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. కొన్ని రోజులుగా పొలానికి వెళ్లే సమయంలో ముగ్గురు యువకులు తనపై లైంగికదాడికి పాల్పడ్డారని, ఇది భరించలేక పురుగుల మందు తాగినట్లు తెలిపింది. అయితే, ఆ యువతి దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా.. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో యువతి మృతికి ముగ్గురు యువకులు కారకులనే వార్త చక్కర్లు కొట్టడంతో అసలు విషయం బయటకు పొక్కింది. దీంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

దేవరకద్ర, సెప్టెంబర్ 22 : మైనర్ బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లగా.. తాత, అవ్వ వద్ద ఉంటూ చదువుకుంటున్నది. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో తాత, అవ్వ నిద్రిస్తుండగా.. సదరు బాలిక టీవీ చూస్తూ ఉన్నది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బాలిక నోట్లో గుడ్డ కుక్కి బలవంతంగా బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. కుటుంబసభ్యులకు విషయం చెప్పగా ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగన్న తెలిపారు.

వి'ధ్వంస' చర్యలు !

ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో నిరంజన్‌రెడ్డి (ఫైల్)

- కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు ధ్వంసం
- వనపర్తిలో విష సంస్కృతికి తెరలేపుతున్న నేతలు

నాగవరం వద్ద ధ్వంసం చేసిన ఐటీ టవర్ శిలాఫలకం

వనపర్తి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : దశాబ్దాల వనపర్తి రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేని విష సంస్కృతికి తెరలేపుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా సారథ్యం వహించిన వారెవ్వరూ ఇలాంటి విధానానికి ఊతం ఇవ్వలేదు. అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రజాప్రతినిధులు వ్యవహరించారు. అభివృద్ధిలో పోటీ పడ్డారు.. తప్పితే.. వివాదాలకు అవకాశం ఇవ్వలేదు. కానీ ఇందుకు భిన్నంగా ఇప్పుడు వనపర్తిలో కొత్త పంథాను అవలంభిస్తుండడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లా కేంద్రంగా ఏర్పాటైన వనపర్తిలో అభివృద్ధి పరుగు పెట్టిందన్నది బహిరంగ రహస్యం. నాడు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగానూ.. తర్వాత వ్యవసాయ శాఖ మంత్రిగానూ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నాటి సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారు. ఇప్పటికీ ఈ నిజాన్ని కాదనేవారు లేరు. నియోజకవర్గంలో మొదటి ఐదేండ్లు సాగునీటిని పరవళ్లు తొక్కిస్తే.. రెండో దఫాలో అభివృద్ధిని పరుగు పెట్టించారు. విద్యాపరంగా ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు, గురుకుల వ్యవసాయ డిగ్రీ, మత్స్య కళాశాలలు, పాలనాపరమైన కొత్త భవనాలు, రోడ్ల విస్తరణలు, పార్కులు, సమీకృత మార్కెట్ యార్డులు, ట్యాంక్‌బండ్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు లెక్కకుమించి చేశారు.

పైశాచిక ఆనందం

ఆనవాళ్లు కొత్త ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం తీపి గుర్తులుగా కనిపిస్తున్నాయి. నిధులు మంజూరై శంకుస్థాపనలు చేసినవి ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇంచుమించు వచ్చే ఐదేండ్ల కాలానికి సరిపడా పనులకు సంబంధించి గత ప్రభుత్వం హయాంలోనే బీజాలు పడ్డాయి. అయితే, అభివృద్ధి పేరుతో వేసిన శిలాఫలకాలు తమకు కనిపించవద్దు అన్నట్లుగా కొన్ని అదృశ్య శక్తులు ధ్వంస రచనకు శ్రీకారం చుట్టాయి. ఈ పరిణామాలతో పట్టణంలోని విజ్ఞులు, మేధావులు ఎవరికివారు ఇదేం సంస్కృతి అంటూ ప్రశ్నించుకుంటున్నారు. విద్యకు అడ్డాగా పేరున్న వనపర్తిలో అభివృద్ధి కోసం వేసిన శిలాఫలకాలను పగులుగొట్టి పైశాచిక ఆనందం పొందడం ఏమిటన్న చర్చకు తెరలేచింది. నాగవరం పరిధిలో రూ.22 కోట్లతో మంజూరైన ఐటీ టవర్, పాలిటెక్నిక్ కళాశాల బాలుర, బాలికల హాస్టళ్ల కోసం రూ.8 కోట్లతో వేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అలాగే పాన్‌గల్ రోడ్డులో వేసిన డైనేజీ, రోడ్డు విస్తరణకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సైతం పగులగొట్టి మోరీలో పడేశారు. ఇవన్నీ చూస్తే.. కొత్త రాజకీయ వింతలను తలపిస్తున్నాయని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. జరిగిన అభివృద్ధిని, ఇంకా జరగాల్సిన పనులను శిలాఫలకాలను లేకుండా చేస్తే.. ప్రజలు మరి చిప్పో తలా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తెలంగాణ వ్యతిరేకులుగా ముద్రపడ్డ వారి శిలాఫలకాలను సైతం గౌరవించి వనపర్తి గడ్డపై నేడు జరుగుతున్న విధ్వంసపు చర్యలతో ప్రజలు నివ్వెరపోతున్నారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదు.. ఉన్నంత కాలం ఎంత గొప్పగా పని చేశారన్నదే గుర్తుంటుందని పట్టణ ప్రజలే అనుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడంతో సమస్య జటిలమవుతోన్నది. ఇంతటితో నైనా శిలాఫలకాల ధ్వంసం ఆగుతుందా..? కొనసాగుతుందా..? అన్నది వేచి చూడాల్సిందే.

పాలిటెక్నిక్ హాస్టల్ భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

అభివృద్ధిని చెరిపేస్తారా?

ఎన్నికలప్పుడు రాజకీయాలు చేయాలి. ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. 9 నెలలు గడిచినా అదే ఒరవడిని చూపించడం సరికాదు. నిలిచిన పనుల పూర్తి కోసం ప్రజలు కొండకు ఎదురు చూసినట్లు ఉన్నారు. ఇంకా మొదలెట్టని పనులను చేపట్టాలి. చేయాలనుకుంటే.. ఐదేండ్లకు సరిపడా పనులున్నాయి. లేని కొత్త విష సంస్కృతిని తీసుకురావడం ఈ ప్రాంత అభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిది. జరిగిన అభివృద్ధిని చెరిపేయాలనుకోవడం అవివేకం తప్పా మరొకటి కాదు. శిలాఫలకాలను పగులగొట్టడం వంటివి వివాదాలకు దారితీస్తాయి తప్పా ఉపయోగం లేదు.

– వాకిటి శ్రీధర్,
బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి

కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుద్దాం

- సమస్యలపై పోరాడే నాయకులే ప్రజాదరణ పొందుతారు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 22 : ప్రజా సంక్షేమ కోసం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుద్దామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు స్థానికంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. కార్యదక్షత, అనుభవం లేని ప్రభుత్వం నేడు పరిపాలనలో ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని, 60 లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే 40 లక్షల మంది మాత్రమే రైతులు రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించి రైతు రుణమాఫీకి క్యాబినెట్‌లో రూ.27వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే మంజూరు చేసిందని దుయ్యబట్టారు. రైతుబంధు పంట కాలం ముగుస్తున్నా నేటికీ ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచారన్నారు. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, కేసీఆర్ కిట్టు, అమ్మఒడి, మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు మంగళం పాడిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. ఆశ్రిత పక్షపాతం పాటిస్తూ అనుయాయులకు పెద్దపీట వేస్తున్నారని, 9 నెలల కాలంలో ఒక్క కొత్త జీవో ఇవ్వకుండా ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించి మన హయాంలో జరిగిన అభివృద్ధిని కూడా ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హనీమూన్ పీరియడ్ ముగిసిందని ప్రజల సమస్యలపై ఎక్కడిక్కడ నిలదీయాలన్నారు. నాయకులు వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకుండా విధానాలపై మాట్లాడి ప్రజల మన్ననలు పొందాలని హితవు పలికారు. ప్రజల సమస్యలపై పోరాడే నాయకులే ప్రజాధరణ పొందుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు బీ లక్ష్మయ్య, సర్దార్‌ఖాన్, అశోక్, గంధం పరంజ్యోతి, కృష్ణ నాయక్, పృథ్వీరాజ్, సంధ్యా తిరుపతయ్య, రఘుపతి రెడ్డి, పద్మా వెంకటేశ్, విజయ్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, జగన్నాథంనాయుడు, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రె స్వామి, సాయికుమార్, రాములు, వెంకటస్వామి, వేణు, రాళ్ల కృష్ణయ్య, రఘురామారావు, బాలరాజు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 22 : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన తెలకపల్లి మండలం కారువంగ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం కారువంగకు చెందిన సామ నిరంజన్(55) గ్రామంలోని గుండేటికుంట వద్ద ఉన్న తన వ్యవసాయ పొలంలో రోజు మాదిరిగానే ఆదివారం కూడా మిరపతోటకు నీళ్లు పారపెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో అప్పటికే బోరుమోటర్‌కు ఉన్న విద్యుత్ తీగలు కిందపడి ఉండగా గమనించకపోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సామ లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. రైతు హఠాన్మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అధికారులకు నెమలి అప్పగింత

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 22 : మండలంలోని జాజాపూర్‌లోని బాలగారి రాములమ్మ పొలం వద్ద గాయాలతో ఉన్న నెమలిని గమనించింది. అది పూర్తిగా నడవలేని స్థితిలో ఉండడంతో వెంటనే ఇంటికి తీసుకొచ్చి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు గ్రామానికి చేరుకోగా మాజీ ఉపసర్పంచ్ బాలగారి అశోక్, కోల శ్రీను, లక్ష్మి, మైనుద్దీన్, మహేశ్ తదితరులు గాయపడిన నెమలిని అప్పగించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కేటీదొడ్డి, సెప్టెంబర్ 22 : ముగ్గురు యువకుల వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్నదని రెండు రోజులుగా ఉమిత్యాల గ్రామానికి చెందిన యువకుల ఫొటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దీంతో గ్రామానికి చెందిన యువకుడు మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల దవాఖానకు తరలించగా.. ప్రాణాపాయమేమీ లేదని వైద్యులు చెప్పారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- రెండు రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న కౌకుంట్ల ప్రజలు
- హన్వాడ మండలంలోనూ అదే పరిస్థితి

కౌకుంట్లలో తాగునీటి కోసం ట్యాంక్ వద్ద గుమిగూడిన మహిళలు

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), సెప్టెంబర్ 22 : కౌకుంట్ల మండల కేంద్రంలో గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే మన్యంకొండ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ పనులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారని అందుకే తాగునీటి సరఫరా నిలిచిపోయిందని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. గ్రామంలో గతంలో మిషన్ భగీరథతో పాటుబోర్ల ద్వారా కూడా తాగునీటి సరఫరా చేసేవారని, ప్రస్తుతం అవి కూడా పనిచేయక పోవడంతో ప్రజలకు తాగునీటి తంటాలు తప్పడం లేదు. పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా ఎవరికీ సరిపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్క రోజు కూడా తాగునీటి కోసం రోడ్డుపైకి వచ్చిన పరిస్థితి లేదని, నేడు మళ్లీ బిందెలు పట్టుకొని ట్యాంకర్ల వద్దకు పరిగెత్తే పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న తాగునీరులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టంకరలో మినీవాటర్ ట్యాంకు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

నానా తంటాలు

హన్వాడ, సెప్టెంబర్ 22 : ప్రస్తుతం వర్షాకాలం అన్నిచెరువులు, కుంటలు నిండి బోరు బావుల్లో నీటిమట్టం పెరిగినా గ్రామాల్లో మూడు రోజుల నుంచి తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారంటే అధికారుల నిర్లక్ష్యమా.. ప్రభుత్వ అసమర్థతా అర్థం కావడం లేదు. మండలంలోని టంకర, గుడ్డిమల్కాపూరం, బుద్దారం, రాంనాయక్‌తండాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కాక పోవడంతో తాగునీటి కోసం రాత్రి పగలు తేడా లేకుండా గ్రామం చుట్టు పక్కల బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో మూడు రోజులు తాగునీటికి ఇబ్బంది ఉంటే ఆ సమస్యను పరిష్కరించిన మళ్లీ మూడు రోజుల నుంచి తాగునీటికి గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే బోయపల్లి గ్రామం సమీపంలో ఓ తండా దగ్గర పైపులైన్ లీకేజీ అయ్యిందని, వాటికి మరమ్మతులు చేస్తున్నారని త్వరలోనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెబుతున్నారు.

అవయవదానంపై అవగాహన

అవయవ నిర్మాణంపై వివరిస్తున్న వైద్య విద్యార్థిని

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 22 : మానవ శరీర నిర్మాణం, అందులోని వివిధ రకాల వ్యవస్థలు, వాటి పనితీరు, రక్షణతో పాటు అవయవ దానంపై విద్యార్థులకు ఎస్‌వీఎస్ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఎస్‌వీఎస్ దవాఖానలో నిర్వహిస్తున్న వైద్య విజ్ఞాన మేళాకు ఆదివారం 5వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 25వైద్య విభాగాల పర్యవేక్షణలో 1,200 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి మానవ శరీర నిర్మాణం, చేసే పనులు, కణజాలాలు, అస్తిపంజర, జీర్ణ, శ్వాస, పునరుత్పత్తి, మూత్ర, గుండె, రక్తప్రసరణ, నాడీ, కండరాలు, వినాళ వ్యవస్థ, ప్రత్యేక జ్ఞానేంద్రియ అవయవాలు, ఆర్థో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఇతర వైద్య సంబంధమైన సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. వైద్య విద్యాసంస్థలు స్థాపించి 25ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దవాఖాన డైరెక్టర్ రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో దవాఖాన కార్యదర్శి కృష్ణారెడ్డి, విజయ రాఘవన్, కళాశాల ప్రిన్సిపాల్ జోషి, వైద్య, నర్సింగ్ విద్యార్థులుసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌వీఎస్ కళాశాల వైద్య సిబ్బంది